సాక్షి
కామారెడ్డి
బుధవారం । 13 । సెప్టెంబర్ । 2023



మహిళల ఆరోగ్యానికి పెద్దపీట
మహిళల ఆరోగ్యానికి భద్రత కల్పించేందుకు కేసీఆర్ ఆరోగ్యమహిళా పథకాన్ని ప్రారంభించారని ఎమ్మెల్యే జాజాల పేర్కొన్నారు.
- 9లో ▸



అనర్హుల ఏరివేతకు చర్యలు
రేషన్ కార్డుల్లో అనర్హుల పేర్లు తొలగించేందుకు లబ్ధిదారులంతా రేషన్ షాపుల్లో వేలిముద్రలు వేయాలని సర్కారు ఆదేశించింది.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.6 /23.1

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం ఎండ కాస్తుంది. మధ్యాహ్నం మేఘావృతమై మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

16న జిల్లాస్థాయి సైన్స్ సెమినార్

కామారెడ్డి టౌన్ : రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 16వ తేదీన జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌ను పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ దేవునిపల్లి పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి తెలిపారు. మిల్లెట్స్ ఒక సూపర్ ఫుడ్ లేదా వ్యామోహమా?' అనే అంశం మీద జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలో 8,9,10, తరగతులు చదువుతున్న వివిధ మాధ్యమాల్లో చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. విద్యార్థులు 6 నిమిషాల నిడివి ఉన్న సెమినార్ చార్ట్స్ లేదా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించవచ్చన్నారు. మొదటి స్థానం వచ్చిన విద్యార్థులను 19వ తేదీన రాష్ట్ర స్థాయిలో హైదరాబాద్‌లో జరిగే సెమినార్‌కు ఎంపిక చేస్తామన్నారు. విద్యార్థులు 16వ తేదీ ఉదయం 10 గంటలకు వారి గైడ్ టీచర్స్ సాయంతో రిజిస్ట్రేషన్ చేసుకొని పాల్గొనాలన్నారు. 9440414250లో సంప్రదించాలన్నారు.

రూట్‌మ్యాప్ పరిశీలన



కామారెడ్డి క్రైం : కామారెడ్డిలో జరిగే గణేశ్ నిమజ్జన శోభాయాత్ర రూట్ మ్యాప్‌ను కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సిరిసిల్ల రోడ్, స్టేషన్ రోడ్, వీక్లీ మార్కెట్, వేణుగోపాల స్వామి రోడ్, అంబేడ్కర్ చౌరస్తా మీదుగా నిజాం సాగర్ చౌరస్తా, కొత్త బస్టాండ్ నుంచి అడ్లూరు ఎల్లారెడ్డి పెద్ద చెరువు వరకు పర్యటించి ఆయా రోడ్లను పరిశీలించారు. విద్యుత్ తీగలు బాగు చేయాలని, రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చివేయాలన్నారు. డీఎస్పీ ప్రకాశ్, పట్టణ ఎస్‌హెచ్‌వో నరేష్, మున్సిపల్ కమిషనర్ దేవేందర్, తహసీల్దార్ లత, రెవెన్యూ, మున్సిపల్ శాఖాధికారులు పాల్గొన్నారు.

భూమి రికార్డులు..



బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని తహసిల్ కార్యాలయంలో మంగళవారం మహారాష్ట్ర నాందేడ్ జిల్లా సబ్‌కలెక్టర్ కుల్‌దీప్ జంగం భూమి అడంగల్ పహణీ రికార్డులు పరిశీలించారు. బిచ్కుంద, జుక్కల్, మద్నూర్ మండలాలు నిజాం పరిపాలనలో మహారాష్ట్రలో ఉండేవి. దీంతో 1955–60 ఏళ్లకు సంబంధించిన పహణీ రికార్డులు, పాఠశాలలో ఉన్న అప్పటి విద్యార్థుల టీసీలు, అడ్మిషన్ల రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం మహారాష్ట్రలో మరాఠా, కాపు కులగణన జరుగుతుంది. మద్నూర్, జుక్కల్ మండలాల్లో కూడా రికార్డులు పరిశీలిస్తామన్నారు. తహసీల్దార్ లక్ష్మణ్, సీనియర్ అసిస్టెంట్ శీతల్ దేశాయి, ఎంఈవో రాములు ఉన్నారు.

ఎన్నికలకు సిద్ధమవ్వాలి



కామారెడ్డి క్రైం : రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం అధికారులు సమాయత్తం కావాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించడానికి ప్రత్యేకంగా నియమించిన 17 మంది నోడల్ అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై నోడల్ అధికారులు పూర్తి అవగాహన ఉండాలన్నారు. జిల్లాలో మొత్తం 913 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈనెల 19 వరకు ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, సవరణలకు అవకాశం ఉందన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, స్వీప్ నోడల్ అధికారి శ్రీధర్ రెడ్డి, సీపీఓ రాజారాం, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

సేవా భావంతో పనిచేయాలి..
మహిళా సంక్షేమం, ఆరోగ్య రక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని మంగళవారం పట్టణంలోని రాజీవ్ నగర్ అర్బన్ పీహెచ్‌సీలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రారంభించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, వైద్యురాలు సాయిఈశ్వరి పాల్గొన్నారు.

స్వచ్ఛ్ సర్వేక్షన్ అవార్డుకు శివాయిపల్లి ఎంపిక

సాక్షి, కామారెడ్డి : రాష్ట్ర స్థాయి స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డుకు రాజంపేట మండలం శివాయిపల్లి గ్రామం ఎంపికైంది. ఈనెల 14న హైదరాబాద్ లో జరిగే కార్యక్రమంలో అవార్డు అందించనున్నారు.

చిరుద్యోగుల పోరుబాట!

- క్రమబద్ధీకరణ కోసం రోడ్డెక్కిన సమగ్ర శిక్ష ఉద్యోగులు
- వేతనాల పెంపు కోసం అంగన్‌వాడీల ఆందోళనలు
- సమ్మె నోటీసిచ్చిన ఆశ వర్కర్లు, పంచాయతీ, మధ్యాహ్న భోజన కార్మికులు



ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో వివిధ వర్గాల ఉద్యోగులు తమ సమస్యల పరిష్కా రం కోసం ఆందోళనలకు దిగుతున్నారు. ముఖ్యంగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న చిరుద్యోగులు పోరాటాలను ఉధృతం చేస్తున్నారు.

సాక్షి, కామారెడ్డి : జిల్లాలో సర్వశిక్షా అభియాన్ స్కీంలో భాగంగా విద్యాశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులంతా కొంతకాలంగా రిలే దీక్షలు చేస్తున్నారు. తాజాగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తమ వేతనాల పెంపు కోసం పోరుబాట పట్టారు. అయితే ప్రభుత్వం అంగన్‌వాడీల ఆందోళనలను విచ్ఛిన్నం చేయడంలో భాగంగా కేంద్రాల తాళాలను పగులగొట్టి ఇతర విభాగాలకు చెందిన ఉద్యోగులతో కేంద్రాలను నిర్వహించే ప్రయత్నం చేశాయి. అయితే అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ప్రభుత్వం అవలంభిస్తున్న తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు పెం చమని ఆందోళన చేస్తే ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆశ వర్కర్లు, గ్రామ పంచాయతీ కార్మికులు, మధ్యాహ్న భోజన కార్మికులు కూడా సమ్మె నోటీసు ఇచ్చారు.

పక్షం రోజులుగా సమగ్రశిక్ష ఉద్యోగులు
సమగ్ర శిక్షా అభియాన్ పథకం ద్వారా విద్యాశాఖలో పనిచేస్తున్న సీఆర్పీలు, ఐఈఆర్పీలు, కేజీబీవీ, యూఆర్ఎస్, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, మెసెంజర్లు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు గడచిన పక్షం రోజులుగా సమ్మెలో కొనసాగుతున్నారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తున్నారు.

పాఠశాల విద్యావ్యవస్థలో కీలకంగా ఏ ళ్ల తరబడిగా పనిచేస్తున్న తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఆవేదన చెందుతున్నారు. సమస్యల ను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

సమ్మెకు సై అంటున్న ఆశా వర్కర్లు
వైద్య, ఆరోగ్య శాఖలో క్షేత్ర స్థాయిలో అనేక రకా ల సేవలందిస్తున్న ఆశ వర్కర్లు కూడా సమ్మెకు సై అంటున్నారు. ఈ నెల 25 నుంచి సమ్మెకు దిగుతున్నట్టు ఇప్పటికే ప్రభుత్వానికి నోటీ సు ఇచ్చారు. పల్లెలే కాకుండా పట్టణాల్లో నూ అనేక సేవలందిస్తున్నారు. కరోనా స మయంలో ప్రాణాలను పణంగా పెట్టి ఇల్లి ళ్లూ తిరిగారు. ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు కోసం పోరుబాట పడుతున్నారు.

పంచాయతీ కార్మికులు..
గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు వేతనాల కోసం సమ్మెబాట పట్టేందుకు రెడీ అయ్యారు. ఈ నెల 20 నుంచి సమ్మెకు వెళుతున్నట్టు ప్రకటించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరాకు సంబంధించి నిర్వహణ, విద్యుత్తు దీపాల నిర్వహణ, మురికి కాలువలను శుభ్రం చేయడం.. ఇలా అన్ని పనులను చూసుకునే పంచాయతీ కార్మికులు సమ్మెకు వెళ్తున్నారు. దీంతో పల్లెల్లో మరోమారు పారిశుధ్య సమస్య తలెత్తే పరిస్థితి ఏర్పడనుంది.

మధ్యాహ్న భోజన నిర్వాహకులు..
ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండి పెడుతున్న కార్మికులు కూడా ఈ నెల 15 నుంచి సమ్మెకు దిగుతున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించేదాకా ఆందోళన కొనసాగిస్తామని పేర్కొంటున్నారు. మధ్యాహ్నం భోజనం ఏజెన్సీలకు సకాలంలో బిల్లులు రాక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

సమ్మెబాటలో అంగన్‌వాడీలు..

మహిళా, శిశు సంక్షేమ శాఖ ద్వారా గర్భిణీలు, బాలింతలు, పిల్లల కోసం నిరంతరం శ్రమిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తమ వేతనాల పెంపుదల కోసం జిల్లావ్యాప్తంగా సమ్మెబాట పట్టారు. రెండు రోజులుగా సమ్మెలో ఉన్నారు. అయితే సమస్య పరిష్కరించాల్సిన ప్రభుత్వం సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి కేంద్రాల తాళాలు పగులగొట్టించి ఇతర ఉద్యోగులతో నిర్వహించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం స్పందించాలి..



ప్రజలకు ఎన్నో సేవలందిస్తున్న వివిధ రంగాలకు చెందిన కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అందుకే సమ్మెబాట పట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆయా సంఘాలు ఆందోళనలు తీవ్రతరం చేస్తాయి. ప్రభుత్వం దిగివచ్చే దాకా ఆందోళనలు కొనసాగుతాయి.

– చంద్రశేఖర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

రెగ్యులరైజ్ చేసేదాకా పోరాటం



ఏండ్లుగా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తున్నాం. ప్రభుత్వం స్పందించి ఉద్యోగాలను క్రమబద్ధీకరించే దాకా సమ్మె కొనసాగిస్తాం. కాంట్రాక్ట్ పేరుతో శ్రమదోపిడీకి గురవుతున్నాం. ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తేనే ప్రయోజనం.

– సత్యనారాయణ, ఎస్ఎస్ఏ జేఏసీ జిల్లా కార్యదర్శి

నాయినమ్మ ఊరికి కేటీఆర్!

- 20న కోనాపూర్‌లో స్కూల్ భవనం ప్రారంభోత్సవం
- ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశాలు



సాక్షి, కామారెడ్డి : మంత్రి కేటీఆర్ సొంత డబ్బులతో నాయినమ్మ ఊరు కోనాపూర్‌లో నిర్మించిన పాఠశాల భవనాన్ని ప్రారంభించేందుకు ముహూర్తం ఖరారైంది. ఈనెల 20న కేటీఆర్ పర్యటన ఖరారైనట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. రెండు మూడు నెలల కిందటే పాఠశాల భవన నిర్మాణం పూర్తయ్యింది. అప్పట్లోనే ప్రారంభోత్సవం చేయాలని భావించారు. అయితే రకరకాల కారణాలతో కార్యక్రమం వాయిదాపడుతూ వచ్చింది. ఎట్టకేలకు ఈ నెల 20న ఖరారైనట్టు తెలుస్తోంది. సీఎం కేసీఆర్ కామారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్న నేపథ్యంలో అందరి దృష్టి కామారెడ్డి నియోజకవర్గంపైనే ఉంది. కేటీఆర్ పర్యటనతో వచ్చే ఎన్నికలకు సంబంధించి శంఖారావం పూరిస్తారని భావిస్తున్నారు. ఈనెల 15న మెడికల్ కాలేజీని వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఆరోజు 15 వేల మందితో ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. జనసమీకరణపై దృష్టి సారించారు. మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవం తర్వాత కోనాపూర్ ప్రారంభోత్సవాలు, సభ నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో క్లారిటీ రావచ్చని భావిస్తున్నారు.

రేపు తెలంగాణ ఉద్యమకారుల సమావేశం

- హాజరుకానున్న కోదండరాం

సాక్షి, కామారెడ్డి : తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారుల సమావేశం ఈనెల 14న కామారెడ్డిలో ఏర్పాటు చేశారు. స్థానిక రోటరీ ఆడిటోరియంలో జరిగే సమావేశానికి ప్రొఫెసర్ కోదండరాం హాజరుకానున్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్


దోమకొండలో పంచాయతీరాజ్ డివిజన్ ఆఫీస్‌ను ప్రారంభిస్తున్న విప్ గంప గోవర్ధన్

దోమకొండ : బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి పనులు జరిగాయని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పంచాయతీరాజ్ డివిజన్ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. పంచాయతీరాజ్ డివిజన్ కార్యాలయం ఏర్పాటుతో చుట్టుపక్కల మండలాలు, గ్రామాలకు కార్యాలయం అందుబాటులో ఉండి సేవలు అందుతాయన్నారు. సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. కార్యాలయ డివిజన్ అధికారి మురళి బాధ్యతలను స్వీకరించారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, మాజీ చైర్మన్ కుంచాల శేఖర్, సింగిల్‌విండో చైర్మన్‌లు పన్యాల నాగరాజ్‌రెడ్డి, తిరుపతిగౌడ్, సర్పంచ్ నల్లపు అంజలి, ఎంపీటీసీ సభ్యులు శంకర్, రమేష్, సదానంద, రైతుబంధు జిల్లా డైరెక్టర్ శంకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వంగ లలిత, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఆటలు సాగనివ్వం

- వచ్చే ఎన్నికల కోసం రూ. 20 కోట్ల మద్యం డంప్ చేసిన బీఆర్ఎస్
- ఓ సినీ నిర్మాతకు బాధ్యతలు
- ఐజీ స్థాయి పోలీసు అధికారితో సర్వే
- హైదరాబాద్‌కు చెందిన వర్గానికి కామారెడ్డిలో కొత్త ఓట్లు
- బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకట రమణారెడ్డి


చింతమడకలో రేషన్ కార్డులను అక్రమంగా మంజూరు చేశారని చూపుతున్న వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్ : కామారెడ్డిలో సీఎం కేసీఆర్ ఆటలు, జూటా మాటలు సాగనివ్వమని, బరిగీసీ బీజేపీ గెలుపెంటో చూపిస్తామని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గజ్వేల్‌లో ఓడిపోతానని భయంతోనే కామారెడ్డిలో పోటీకి వస్తున్నారని, సీఎంకు కామారెడ్డిలో ఓటమి ఖాయమన్నారు. కామారెడ్డిలో రూ. 200కోట్ల విలువ చేసే మద్యం పంపిణీకి బీఆర్ఎస్ ఏర్పాట్లు చేసుకుందని, ఇప్పటికే రూ. 20 కోట్ల మద్యం డంప్ చేశారని ఆరోపించారు. ఇందుకు సినీ పరిశ్రమలోని ఓ నిర్మాతకు బాధ్యతలు అప్పగించారన్నారు. త్వరలోనే ఆ మద్యం ఎక్కడుందో పట్టిస్తామన్నారు.

ఇక్కడ సీఎం గెలుస్తాడో లేదో అని ఐజీ స్థాయి పోలీసు అధికారి బృందంతో 15 రోజుల పాటు సర్వే చేయించారన్నారు. కామారెడ్డిలో హైదరాబాద్‌కు చెందిన ఒక వర్గం నూతన ఓట్లు సృష్టించారని, ఇప్పటికే 10శాతం ఓట్లు పెంచారన్నారు. తాగునీటి కోసం రూ.195 కోట్లు ఇవ్వగానే నిధుల వరద వస్తుందని ప్రచారం చేసుకుంటున్నారని, 9 ఏళ్లుగా కామారెడ్డిలో తాగునీటి పైప్‌లైన్ సమస్య ప్రభుత్వ విప్‌కు కనిపించలేదా అని ప్రశ్నించారు. బీజేపీ నాయకులు మున్సిపాలిటీ ఎదుట ఉద్యమం చేస్తే కేసులు పెట్టారన్నారు. రాత్రికి రాత్రి ఒక్క చింతమడకకే రూ.2 వేల కోట్లు కేటాయించారని, కామారెడ్డిలో 96 గ్రామాలకు ఎన్ని వేల కోట్లు తెప్పిస్తారని గంప గోవర్ధన్‌కు సవాల్ విసిరారు. కామారెడ్డిలో మాస్టర్ ప్లాన్ రద్దయిందని అంటూనే లింగాపూర్ ఉంచి టేక్రియాల్ సబ్ స్టేషన్ వరకు నూతన రోడ్డుకు మంజూరు ఇచ్చారని, భూములు కోల్పోతున్న రైతులు ఆలోచించాలన్నారు. చింతమడక, గజ్వేల్ లో అభివృద్ధి చెప్పినంతగా జరగలేదని అక్కడి అవినీతి, అక్రమాలను ఆధారాలతో నిరపిస్తామన్నారు.

అక్రమంగా రేషన్ కార్డుల జారీ
చింతమడకలో 600 ఇళ్లు ఉంటే వెయ్యిగా చూపించారని, రాష్ట్రంలో ఎక్కడా మంజూరు కానీ రేషన్‌కార్డు అక్కడ మంజూరు చేశారన్నారు. గజ్వేల్‌లో బస్టాండ్ నిర్మాణానికి తొమ్మిదేళ్లు పట్టిందన్నారు. గంపగోవర్ధన్ చూస్తే జాలీగా ఉందన్నారు. కేసీఆర్ వస్తే అభివృద్ధి జరుగుతుందని బీఆర్ఎస్ భావిస్తోందని, అంటే గంపగోవర్ధన్ ఇప్పటివరకు చేసిందేమీ లేనట్లేనన్నారు. గతంలో జర్నలిస్టులకు ఇచ్చిన 184 గజాల స్థలాలను లాక్కుని ఇప్పుడు లేఅవుట్ లేని పనికిరాని భూమిలో కొబ్బరికాయ కొట్టారన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీకాంత్, కౌన్సిలర్ నరేందర్ నాయకులు విపుల్ తదితరులున్నారు.

విద్యార్థినులకు ఫుడ్‌పాయిజన్

భీమ్‌గల్ కస్తూర్బాలో ఘటన
- 120 మందికి అస్వస్థత
- అర్ధరాత్రి 84 మంది జీజీహెచ్‌కు తరలింపు
- త్రీమెన్ కమిటీ వేసి విచారణ జరిపిన అధికారులు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు మంత్రి ఆదేశాలు


నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ఖలీల్‌వాడి : భీమ్‌గల్ పట్టణంలోని కస్తూర్బా విద్యాలయం విద్యార్థినులకు ఫుడ్ పాయిజన్ కావడం జిల్లాలో తీవ్ర కలకలం రేపింది. సోమవారం రాత్రి భోజనం తర్వాత 11.30 గంటలకు 120 మంది విద్యార్థినులకు వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి రాగా విద్యాలయ సిబ్బంది 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం సీరియస్‌గా ఉన్న 84 మందిని అర్ధరాత్రి ఒంటి గంట కు నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీ సుకొచ్చారు. సిబ్బంది ఎమర్జెన్సీ గదిలో విద్యార్థి నులకు ప్రత్యేక వైద్యం అందించారు. ఫుడ్ పాయిజన్ విషయం తెలుసుకున్న విద్యార్థినుల తల్లిదండ్రులు ఆస్పత్రికి తరలి రాగా, కొందరు కన్నీరు పెట్టుకున్నారు. ఎమర్జెన్సీ వార్డులో ఒకే బెడ్‌పై ఇ ద్దరికి వైద్యం అందిన సిబ్బంది మంగళవారం ఉదయం వార్డులకు షిఫ్ట్ చేశారు.

స్కూల్‌కు సమీపంలోనే డంపింగ్ యార్డ్..
స్కూల్ సమీపంలోనే డంపింగ్‌యార్డ్ ఏర్పాటు చేయడంతో అక్కడి నుంచి వచ్చే పొగతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా గుట్ట నుచ్చే వర్షపు నీరు పాఠశాల ఆవరణలోకి చేరుతుంది. దీంతో పరిసరాలు కలుషితం కావడంతో పాటు వంట సామగ్రి, తాజా కూరగాయాలు లేక పోవడంతోనే ఫుడ్ పాయిజన్ జరిగినట్లు స్థానికంగా చర్చనీయాంశమైంది.

మంత్రి ప్రశాంత్‌రెడ్డి సీరియస్..
విద్యార్థినులకు ఫుడ్ పాయిజన్ ఘటనపై మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రతిమారాజ్‌తో మాట్లాడి విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు.

త్రీమెన్ కమిటీ..

కలెక్టర్ త్రీమెన్ కమిటీ వేయగా తహసీల్దార్ వెంకటరమణ, ఎస్సై హరిబాబు, ఎంపీడీవో రాజేశ్వర్ కమిటీ సభ్యులు ఏంఈవో స్వామి భీంగల్ కస్తూర్బాకు వెళ్లి వంట గది, పరిసరాలను పరిశీలించారు. వంట గది సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఆహార పదార్థాల శాంపిల్స్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్‌కు సూచించారు. ప్రస్తుతం ఎలాంటి ప్రమాదం లేదని బాలికలకు ఆయన ధైర్యం చెప్పారు. ఘటన జరిగిన స్కూల్‌లో ప్రత్యేకంగా వైద్య శిబిరం ఏర్పాటు చేయించామన్నారు.


విద్యార్థినితో మాట్లాడుతున్న నిజామాబాద్ కలెక్టర్

జాతీయ లోక్ అదాలత్ సక్సెస్

- జిల్లా జడ్జి ఎస్ఎన్ శ్రీదేవి

కామారెడ్డి క్రైం : జాతీయ లోక్‌అదాలత్ విజయవంతమైందని జిల్లా జడ్జి ఎస్ఎన్ శ్రీదేవి పేర్కొన్నారు. కామారెడ్డి కోర్టు ఆవరణలో మంగళవారం లీగల్ అథారిటీ సెల్ ఆధ్వర్యంలో అభినందన సభలో ఆమె మాట్లాడారు. ఈనెల 9న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 4,884 కేసులను పరిష్కరించామన్నారు. కేసుల పరిష్కారానికి కామారెడ్డి పోలీసులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఎంతగానో సహకరించారన్నారు. సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శివరాత్రి ప్రతాప్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా, వాణిజ్య లైంగిక దోపిడిలను అరికట్టాలన్నారు. కామారెడ్డి కోర్టు ఆవరణలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కాంగిరేసులో జ్యోతిర్మయరెడ్డి

- బాన్సువాడ టిక్కెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు
- తండ్రి చేసిన సేవలే గెలిపిస్తాయని ధీమా


జ్యోతిర్మయరెడ్డి

సాక్షి, కామారెడ్డి : మాజీ ఎమ్మెల్సీ ఆర్ వెంకట్రాం రెడ్డి తనయుడు జ్యోతిర్మయరెడ్డి బాన్సువాడ నుంచి ఎన్నికల బరిలో నిలిచేందుకు ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ఆశిస్తున్న జ్యోతిర్మయరెడ్డి ఇటీవల టిక్కెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్న తన తండ్రికి నియోజకవర్గంలో మంచి పట్టు ఉందని, తాను ఎన్నో సేవా కార్యక్రమాలు చేశానని పేర్కొంటూ జ్యోతిర్మయరెడ్డి టిక్కెట్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఎంబీఏ ఆ తర్వాత లా అభ్యసించిన జ్యోతిర్మయరెడ్డికి కాంగ్రెస్ పార్టీలో చాలా మంది నేతలతో పరిచయాలున్నాయి. పార్టీకి సంబంధించిన అనేక కార్యక్రమాలను సక్సెస్ చేయడానికి తనవంతు ప్రయత్నాలు చేసేవారు. దశాబ్దాలుగా తమ కుటుంబం కాంగ్రెస్ పార్టీతోనే ఉందని, తనకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరుతున్నారు. నియోజకవర్గంలో తన తండ్రికి ఉన్న పరిచయాలు, తాను సమితి చైర్మన్‌గా, జిల్లా సహకార బ్యాంకు చైర్మన్‌గా అలాగే ఎమ్మెల్సీగా బాన్సువాడ ప్రాంత అభివృద్ధికి ప్రజలకు ఎన్నో సేవలందించాడని తెలిపారు. పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకత్వంతో సంబంధాలు ఉండడంతో టిక్కెట్ వస్తుందన్న ధీమాతో ఉన్నారు.

బాన్సువాడ నుంచి పోటీ చేయడానికి దరఖాస్తు చేసుకున్న జ్యోతిర్మయరెడ్డి టిక్కెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీలోని అన్ని గ్రూప్‌లు అండగా నిలుస్తాయనే భావనతో ఉన్నారు. పార్టీ తనకు పోటీ చేసే అవకాశం కల్పిస్తే ఖచ్చితంగా విజయం సాధిస్తానని జ్యోతిర్మయరెడ్డి అంటున్నారు. ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ నియోజకవర్గంలో తమకు విస్తృత పరిచయాలున్నాయని, తనకు టిక్కెట్ ఇస్తే సులువుగా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

అనర్హుల ఏరివేతకు చర్యలు

- రేషన్‌కార్డుల్లో ఉన్నవారంతా వేలిముద్రలు వేయాల్సిందే..
- అందుబాటులో లేని వారి పేర్లు తొలగించనున్న సర్కారు
- రేషన్ డీలర్ల ద్వారానే ప్రక్రియ
- ఈ ప్రక్రియ పూర్తయ్యాకే కొత్తకార్డులు..?



కామారెడ్డిలోని రేషన్ దుకాణం

కామారెడ్డి రూరల్ : రేషన్ కార్డుల ఏరివేతతో పాటు రేషన్‌కార్డుల్లోని యూనిట్లను తొలగించనున్నారు. ఈ ప్రక్రియ త్వరగా ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రేషన్ దుకాణం వారీగా సదరు ఏరివేత ప్రారంభం కానుండగా నేడో రేపో పౌరసరఫరాల అధికారులు రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించి మార్గదర్శకాలను వివరించనున్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికలకు అక్టోబర్‌లో నోటిఫికేషన్ వచ్చే అవకాశముండగా సదరు సమయంలోగా ఏరివేతను పూర్తి చేసి కొత్త కార్డులను జారీ చేసే అవకాశముంది.

రేషన్ దుకాణాల వారీగా..

జిల్లాలో కార్డులు, యూనిట్ల ఏరివేతను రేషన్ డీలర్ పరిధిలో చేపట్టనున్నారు. రేషన్ డీలర్లు డీ డూప్లికేట్ ప్రక్రియలో ఎలక్ట్రానిక్ నొ యువర్ కస్టమర్(ఈకేవైసీ) చేపట్టనున్నారు. ప్రస్తుతం రేషన్ బియ్యం తీసుకోవాలంటే వేలిముద్ర వేస్తున్నట్లుగానే అదే విధానంలో రేషన్ దుకాణానికి వెళ్లి వేలిముద్ర వేయాలి. కార్డులో ఎంత మంది ఉంటే అంతమంది వేలిముద్ర వేయాల్సిందే. ఒక వేళ వేలిముద్ర పడకుంటే ఐరిస్ ద్వారా నిర్ధారించనున్నారు. సదరు ప్రక్రియలో పాల్గొనకుంటే కార్డును రద్దు చేయనున్నారు.

రెండేళ్లకోసారి ఏరివేత...

అసలు లబ్ధిదారులకే రేషన్ సరుకులు చేరాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం పలుమార్లు బోగస్ కార్డుల ఏరివేత చేపట్టింది. 2018లో రెవెన్యూ, రేషన్ డీలర్లు సంయుక్తంగా ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. అనంతరం 2020లో రేషన్ కార్డుకు ఆధార్‌కార్డు అనుసంధానం చేపట్టడంతో బోగస్ కార్డులను తొలగించారు. ఇందులో ఉద్యోగులు ఉండటం విశేషం.

జిల్లాలో మొత్తం జీపీలు	526
మున్సిపాలిటీలు	3
మొత్తం రేషన్ దుకాణాలు	578
జిల్లాలో మొత్తం కార్డులు	2,34,879
మొత్తం యూనిట్లు(వ్యక్తులు)	8,61,131

డీ డూప్లికేట్ తర్వాతే..

ఆగస్టు 21 నుంచి కొత్త రేషన్ కార్డుల జారీ ఉంటుందని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతుండగా అదంతా తప్పుడు ప్రచారమని అధికారులు కొట్టిపారేశారు. కాగా డి డూప్లికేట్ పూర్తయ్యాకే కొత్త రేషన్ కార్డుల జారీ ఉంటుందని సమాచారం. పెళ్లయిన వారితోపాటు ఇతర ప్రాంతాల్లో స్థిరపడినవారు, నూతనంగా జన్మించిన పిల్లలను కార్డులో చేర్చుకునేలా వెసులుబాటు కల్పించే అవకాశముంది.

రేషన్ డీలర్లకు తలనొప్పే..

రేషన్ కార్డుకు ఈ కేవైసీ అనుసంధానం రేషన్ డీలర్లకు తలనొప్పిగా మారనుంది. రేషన్ కార్డులో ఉన్న ప్రతి ఒక్కరి వేలిముద్ర సేకరించాలంటే ఒక్కో రేషన్ షాపులో 300ల నుండి 500 వరకు రేషన్ కార్డులు ఉన్నాయి. అయితే ఒక్కో కార్డులో ఒకరి నుంచి 8 మంది వరకు కూడా ఉంటారు. రేషన్‌కార్డులో వృద్ధుల, పిల్లల వేలిముద్రలు రాకపోవడం, కొందరు ఇతర దేశాలకు వెళ్లడం, కొందరు ఇతర రాష్ట్రాల్లో చదువులకు వెళ్లడం జరిగింది. వారి వేలిముద్రలు సేకరించడం సాధ్యంకాదు. దీంతో వారి పేర్లను తొలగించే అవకాశముంది. ఈ విషయమై కామారెడ్డి జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తమకు ఈ పని అప్పగించవద్దని బుధవారం డీఎస్‌వో మల్లిఖార్జున్ బాబుకు వినతిపత్రం అందజేయనున్నారు.

ఈ కేవైసీ చేయించుకోవాలి



రేషన్‌కార్డుకు ఈ కేవైసీ రేషన్ లబ్ధిదారులు రేషన్ షాపుల్లోనే ఈ కేవైసీ చేయించుకోవాలి. పౌరసరఫరాలశాఖ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. అయితే కార్డుదారుల వివరాలను నవీకరించేందుకు చివరి తేదీ అంటూ ఏమీ రాలేదు. సరుకుల పంపిణీ సమయంలో కాకుండా రేషన్ డీలర్లు ఖాళీగా ఉన్న సమయంలో వేలిముద్రలు నవీకరించుకోవాలి. దీనికి సంబంధించిన విధివిధానాలను రూపొందిస్తున్నాం.

–మల్లికార్జున్‌బాబు, డీఎస్‌వో, కామారెడ్డి

క్లుప్తంగా

'సీఎం భారీ మెజార్టీతో గెలవడం ఖాయం'



దోమకొండ: ప్రజలు మూడోసారి కూడా బీఆర్ఎస్‌కు పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని పార్టీ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ అన్నారు. మంగళవారం అంచనూరులో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కామారెడ్డిలో సీఎం కేసీఆర్ భారీ మెజార్టీతో గెలుస్తారని పేర్కొన్నారు. సీఎం గెలుపును అడ్డుకోవడం ఎవరి వల్లా కాదన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అభివృద్ధిలో ముందుంచారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు గండ్ర మధుసూదన్‌రావ్, జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుంచాల శేఖర్, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మి, తదితరులున్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన



దోమకొండ: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం రెండో రోజు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు నిరసన తెలిపినట్లు వారు తెలిపారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. జిల్లా జేఏసీ ప్రతినిధులు శ్రావణ్ కుమార్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది నాగరాజు, మహేష్, జ్యోతి, లింగం, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

అండర్-14 రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక



భిక్కనూరు: అండర్-14 రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన బాలుడు శరత్ చంద్ర మంగళవారం ఎంపికయ్యాడు. మెదక్ జిల్లా రామాయంపేటలోని మంజీర పాఠశాలలో చదువుతున్న శరత్ చంద్ర హైదరాబాద్‌లోని బోయినపల్లి కృష్ణస్వామి స్పోర్ట్స్ అకాడమీ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో మంగళవారం నిర్వహించిన పోటీల్లో పాల్గొని ఒక గోల్ సాధించి సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. మెదక్ ఉమ్మడి జిల్లా నుంచి శరత్ చంద్ర ఒక్కడే అండర్-14 జట్టుకు ఎంపికయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న భిక్కనూరువాసులు శరత్ చంద్రను ఫోన్‌లో అభినందించారు.

గురువులు సమాజానికి మార్గ నిర్దేశకులు

జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు



నిజాంసాగర్(జుక్కల్): గురువులు సమాజానికి మార్గ నిర్దేశకులని తల్లిదండ్రుల తర్వాతి స్థానం గురువులదేనని జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను విద్యాశాఖ, పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బీఆర్ఎస్ నాయకులు దుర్గారెడ్డి, గంగారెడ్డి, గైని విఠల్, వాజిద్‌అలీ, నర్సింహారెడ్డి, రమేష్‌గౌడ్, లక్ష్మీనారాయణ, తదితరులు ఉన్నారు.

విజయభేరి సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్



బీర్కూర్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): హైదరాబాద్‌లో ఈ నెల 17న జరిగే కాంగ్రెస్ పార్టీ ''విజయభేరి'' సభను విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన తాడ్వాయిలో పార్టీ నేతల సమావేశంలో మాట్లాడారు. అగ్ర నాయకులు సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గేలు పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి పార్టీ ఇన్‌చార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్‌లో..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జుక్కల్ నియోజకవర్గ ఇన్‌చార్జి సొదాగర్ గంగారాం ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీసీసీ అధ్యక్షుడు కైలాష్ శ్రీనివాస్ పాల్గొని విజయభేరి సభను విజయవంతం చేయాలని కోరారు. పీసీసీ డెలిగేట్ విఠల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగ్‌నాథ్ పటేల్ పాల్గొన్నారు.

బీర్కూర్‌లో నేడు సమావేశం

బాన్సువాడ: బీర్కూర్ మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ సమావేశం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోయిని శంకర్ అన్నారు. ఈ నెల 17న హైదరాబాద్‌లో జరిగే విజయభేరి సన్నాహక సభకు కోఆర్డినేటర్లుగా ఉన్న నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, కైలాస్ శ్రీనివాస్‌లు బీర్కూర్‌కు వస్తున్నారని అన్నారు. మున్నూరుకాపు సంఘంలో నిర్వహించే సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి నేతలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. నాయకులు దొంతురాం కాశీరం, మాజీ సర్పంచ్ సానేపు గంగారం, పుల్లెని పీరయ్య, దేశాయ్, కాంత్‌రెడ్డి ఉన్నారు.

భిక్కనూరులో..

భిక్కనూరు: హైదరాబాద్‌లో నిర్వహించనున్న బహిరంగ సభలో కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటిస్తుందని ఆ పార్టీ బ్లాక్ కమిటీ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, పట్టణాధ్యక్షుడు అందే దయాకర్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం వారు భిక్కనూరులో మాట్లాడుతూ.. ప్రజలకు ఈ సభ ద్వారా సోనియా గాంధీ భరోసా కల్పిస్తారన్నారు. కాంగ్రెస్ నేతలు టీపీ లింబాద్రి, సిద్ధగౌడ్, సాజిద్, తదితరులు పాల్గొన్నారు.

చోరీకి గురైన సెల్‌ఫోన్ల రికవరీ

కామారెడ్డి క్రైం: పోలీసుశాఖలో ఇటీవల కొత్తగా తీసుకొచ్చిన సీఈఐఆర్ విధానంతో సెల్‌ఫోన్ల రికవరీ వేగంగా జరుగుతున్నట్లు ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తెలిపారు. కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఒకే రోజు ఎనిమిదికి చోరీకి గురైన సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 325 సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు చెప్పారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ల రికవరీ సులభతరమైందని పేర్కొన్నారు. ఎవరైనా తమ మొబైల్‌ను పోగొట్టుకుంటే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

జాతీయస్థాయి ఉషులో కాంస్యం



నిజామాబాద్‌నాగారం: జిల్లాకు చెందిన క్రీడాకారుడు జైన్షుకు జాతీయస్థాయిలో కాంస్య పతకం సాధించారు. మంగళవారం బీహార్‌లోని పాట్నాలో నిర్వహించిన జాతీయస్థాయి ఉషు పోటీలో జూనియర్ విభాగంలో కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా ఉషు క్రీడాకారులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

రైస్‌మిల్ యజమాని రిమాండ్

నవీపేట: మండలంలోని పొల్ద శివారులో ఉన్న వెంకటలక్ష్మి ఆగ్రో ఇండస్ట్రీ రైస్‌మిల్ యజమాని వేణుగోపాల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నిజామాబాద్ రూరల్ సీఐ సతీశ్, నవీపేట ఎస్సై యాదగిరి మంగళవారంతెలిపారు. గత సీజన్లలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించలేదని పేర్కొన్నారు. రూ. కోటీ86లక్షల విలువైన 50వేల క్వింటాళ్ల ధాన్యాన్ని రైస్‌మిల్‌కు అప్పగించగా కేవలం 20వేల క్వింటాళ్ల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించినట్లు చెప్పారు. డీటీ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు వేణుగోపాల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

బ్లడ్ టెస్ట్‌ల పేరిట రూ.40 వేలకు టోకరా

కామారెడ్డి క్రైం: ఆర్మీ జవాన్లకు ఒకేసారి బ్లడ్ టెస్టులు చేయాల్సి ఉందని నమ్మించి పట్టణానికి చెందిన ఓ ల్యాబ్ టెక్నీషియన్‌కు ఆన్‌లైన్ మోసగాళ్లు రూ.40 వేలకు టోకరా వేశారు. జిల్లా కేంద్రంలోని భూపుత్రమ్మ కల్యాణ మండప ప్రాంతంలో ఉన్న ఓ ల్యాబ్‌లో మాన్‌సింగ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. మరో డాక్టర్‌కు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి 25 మంది ఆర్మీ జవాన్ల బృందానికి ఒకే సారి రక్త పరీక్షలు చేయాల్సి ఉందని అనడంతో సదరు డాక్టర్ మాన్‌సింగ్‌ను పిలిపించాడు. ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లిస్తామని నమ్మించిన మోసగాళ్లు బ్యాంకు అకౌంట్, ఫోన్‌పే నంబర్లు అడుగుతూ మాటల్లో పెట్టి నమ్మించారు. వారు చెప్పిన విధంగా చేయడంతో మాన్‌సింగ్ అకౌంట్‌లో నుంచి రూ.40 వేలు కట్ అయ్యాయి. మోసపోయానని గుర్తించి మంగళవారం సాయంత్రం పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో నరేష్ తెలిపారు.

యువతి మిస్సింగ్

ఖలీల్‌వాడి: నగరంలోని వినాయక్‌నగర్‌లో ఉంటున్న ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. నవీపేట్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి నగరంలోని తన మేనబావ ఇంట్లో ఉంటూ పాలిటెక్నిక్ విద్యను అభ్యసిస్తోంది. సోమవారం కళాశాలకు వెళ్తున్నట్లు చెప్పి తిరిగి రాలేదు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కామారెడ్డిలో బాలుడు..

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని హరిజనవాడకు చెందిన ఓ బాలుడు అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో నరేశ్ మంగళవారం తెలిపారు. కాలనీలో నివాసం ఉండే గంగరాజుకు ఇద్దరు కుమారులు. చిన్న కొడుకు అఖిల్ 8వ తరగతి చదువుతున్నాడు. సోమవారం కాలకృత్యాలకు బయటకు వెళ్లిన అతడు ఇంటికి తిరిగి రాలేదు. బాలుని తండ్రి గంగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

పంటల పరిశీలన

వర్ని(మోస్రా): రైతులు తమ పంటపొలాల్లో అధిక యూరియా చల్లడం వల్లే వరి పంటలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు వస్తోందని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త విజయ్ కుమార్ తెలిపారు. శివారులోని పంట పొలాల్లో రోగ నిర్ధారక క్షేత్ర సందర్శనను స్థానిక వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది



భిక్కనూరులో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నేతలు

- పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దామోదర్‌రెడ్డి

భిక్కనూరు: ప్రపంచానికి భావి పౌరులను అందించే ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనదని పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దామోదర్‌రెడ్డి అన్నారు. మంగళవారం భిక్కనూరు మండల కేంద్రంలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో ఏ రంగంలోనైన నిష్ణాతులను తయారు చేయగలిగే శక్తి ఒక్క ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారికే ఉంటుందన్నారు. తమ వద్ద విద్యను అభ్యసించిన విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగినప్పుడు ఆ ఉపాధ్యాయుడి ఆనందం మాటల్లో చెప్పలేనిదన్నారు. ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందినప్పటికి వారికి సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ప్రపంచం ఉన్నంత వరకు ఉపాధ్యాయ వృత్తికి గౌరవం ఉంటుందన్నారు. మండలంలోని 12 మంది ఉత్తమ ఉపాధ్యాయులు శ్రీనాథ్, కిషన్, శ్రీరంగం శ్రీనివాసచారీ, భవాని, నాగలక్ష్మి, బాలగంగాధర్, మంజుషా, పద్మజారాణి, మోహన్, శ్రీకాంత్, పల్లవి, శిరీషరాణిలను శాలువా, పూలమాలలతో సత్కరించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఎంపీపీ గాలిరెడ్డి, జెడ్పీటీసీ పద్మ నాగభూషణంగౌడ్, ఎంపీటీసీ సువర్ణ, ఎంఈవో ఎల్లయ్య, సర్పంచ్ తున్కి వేణు, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ పురాం రాజమౌళి, పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడు శ్రీనివాసచారీ, ప్రధానకార్యదర్శి పేష్కారి గిరిధర్, పీఆర్‌టీయూ రాష్ట్ర మాజీ అసోసియేట్ అధ్యక్షుడు నర్సింగ్‌రావు పీఆర్‌టీయు రాష్ట్ర బాధ్యులు ఎగ్గు బాపురెడ్డి, మదుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎల్లారెడ్డి/లింగంపేట: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు పార్లమెంటులో చట్ట బద్ధత కల్పించేలా బీఆర్ఎస్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంఆర్‌పీఎస్ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. పార్లమెంట్ సమావేశాలు ఈ నెల 18 నుంచి 22 వరకు జరగనున్న దృష్ట్యా పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్ట బద్ధత కల్పించేందుకు అఖిల పక్షాన్ని సీఎం కేసీఆర్ ఢిల్లీకి తీసుకుని వెళ్లేలా కృషి చేయాలని వారు విన్నవించారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు చిట్యాల సాయన్న, శివానందం తదితరులున్నారు.

కామారెడ్డి సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ముదిరాజ్ సంఘం నేతలు

ఎల్లారెడ్డి: ముదిరాజ్‌లు కామారెడ్డిలో నిర్వహించే సభను విజయవంతం చేయాలని జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు విఠల్ కోరారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణంలోని ముదిరాజ్ సంఘంలో నిర్వహించిన ముదిరాజ్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 24న ముదిరాజ్‌ల చలో కామారెడ్డి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. రాజకీయంగా ముదిరాజ్‌లకు ప్రాధాన్యత ఇచ్చిన పార్టీకి మనమందరం మద్దతు పలకాలని అన్నారు. మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్, ఎల్లారెడ్డి సొసైటీ చైర్మన్ నర్సింలు, తదితరులున్నారు.

అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయడం హర్షణీయం



అధ్యాపకులను సన్మానిస్తున్న టీజీవో బృందం

కామారెడ్డి క్రైం: పదిహేనేళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసిన డిగ్రీ, జూనియర్ కళాశాలల అధ్యాపకులను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయడం హర్షణీయమని గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్ అన్నారు.

కామారెడ్డిలోని డెయిరీ టెక్నాలజీ కళాశాలలో రెగ్యులరైజ్ అయిన అధ్యాపకులను టీజీవో ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. టీజీవో జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ...కలెక్టరేట్‌కు సమీపంలో టీజీవో భవన నిర్మాణానికి 10 గుంటల భూమిని కేటాయించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ప్రభుత్వవిప్ గంపగోవర్ధన్, కలెక్టర్ జితేష్ వి పాటిల్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సాయిరెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయానికి కృషి చేయాలి



నందిపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

నందిపేట్ (ఆర్మూర్): వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున దరఖాస్తు చేసుకున్న అందరూ టికెట్టు ఎవరికి వచ్చినా కలిసికట్టుగా పనిచేయాలని కర్ణాటక సిరిగుప్ప ఎమ్మెల్యే బీఎం నాగరాజు కోరారు. నందిపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆర్మూర్ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామస్థాయిలో బూత్ ఏజెంట్లను నియమించి, కాంగ్రెస్ పార్టీ అమలు చేసే మ్యానిఫెస్టోని ప్రజలకు వివరించాలన్నారు. ఈ నెల 17న తుక్కుగూడలో నిర్వహించే సోనియాగాంధీ బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరాలిరావాలని కోరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏబీ శ్రీనివాస్ (చిన్న), నాయకులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై తల్వార్‌తో నరికి అక్క హత్య



మాచారెడ్డి : కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలో నడిరోడ్డుపై అక్కను తోడబుట్టిన తమ్ముడే తల్వార్ తో నరికి హత్య చేసిన ఘటన రాత్రి కలకలం సృష్టించింది. కామారెడ్డి రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం ..గజ్యాతండా చౌరస్తాకు చెందిన చాందీబీకి రుక్సానా(45)తో పాటు మరో నలుగురు కుమారులు ఉన్నారు. అందులో రెండోవాడైన షేక్ యూసుఫ్‌కు అక్క రుక్సానాకు మధ్య కొన్నిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఆస్తి తగాదాల కారణంగా ఇద్దరి మధ్య అభిప్రాయబేధాలున్నాయి. ఇటీవల రుక్సానాకు చెందిన టాటాఏస్ వాహనాన్ని ఆమెనే నిప్పంటించి తమ్ముడు యూసుఫ్ తగలబెట్టాడని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిని దృష్టిలో పెట్టుకొని ఎలాగైనా అక్కను అడ్డు తొలగించాలని షేక్ యూసుఫ్ పథకం వేశాడు. రుక్సానా మంగళవారం రాత్రి బస్సు దిగి ఇంటికి వెళ్తుండగా కాపుకాసి తల్వార్‌తో తలపై పలుమార్లు నరికాడు. ఆమె అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు వదిలింది. అక్క చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత యూసుఫ్ నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

క్రైం కార్నర్

కులాస్‌పూర్ తండా సర్పంచ్‌పై దాడి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కులాస్‌పూర్ తండా సర్పంచ్ జరుపుల శ్రావణ్‌కుమార్‌పై అదే తండాకు చెందిన పలువురు దాడికి పాల్పడినట్లు ఎస్సై ఎల్ రాము మంగళవారం తెలిపారు. తండాకు చెందిన చందర్ పంట పొలాన్ని శ్రావణ్‌కుమార్ వర్గీయులు దున్నేయడంతో గొడవ జరిగింది. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలోని మిర్చికంపౌండ్‌లో పీడీఎస్ బియ్యం కొనుగోలు చేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముతున్న సమీర్, షేక్ అహ్మద్ నుంచి 60 సంచుల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చెరువులో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: కూతురు సంసారంలో గొడవలు జరుగుతున్నాయనే బెంగతో ఓ తల్లి ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన భూమని బాల్‌రాజవ్వ(60)కి కుమారుడు రాజయ్య, కుమార్తె నర్సవ్వ ఉన్నారు. రాజంపేటకు చెందిన వ్యక్తితో నర్సవ్వకు గతంలోనే వివాహం జరిగింది. ఆమె సంసారంలో కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఎప్పటిలాగే ఇంట్లో అందరూ కలిసి నిద్రించారు. కొడుకు రాజయ్య మంగళవారం ఉదయం నిద్ర లేచి చూడగా తల్లి ఇంట్లో కనిపించలేదు. స్థానికుల సమాచారం మేరకు గ్రామ సమీపంలోని చెరువులో బాల్‌రాజవ్వ మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. దేవునిపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణచేపట్టారు. కొడుకు రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాలువలో యువకుడి గల్లంతు

బాల్కొండ: మండలంలోని కిసానగర్ వద్ద ఎస్సారెస్పీ నుంచి ప్రవహించే వరద కాలువలో ముప్కాల్ మండలకేంద్రానికి చెందిన షేక్‌రియాజ్ గల్లంతైనట్లు ఎస్సై గోపి తెలిపారు. మండల కేంద్రానికి చెందిన రియాజ్ అప్పుల బాధతో కొంతకాలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం గాలింపు చర్యలు చేపడుతామన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో సోమవారం రాత్రి ఇంటి తాళాలు పగుల గొట్టి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఏఎస్సై గణేశ్ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన కుమ్మరి బాల్‌రాజు సోమవారం డిచ్‌పల్లి మండలం కమలాపూర్‌కు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉన్నది. ఇంట్లో బీరువా తాళాలు సైతం పగుల గొట్టి ఉండడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి పరిశీలించారు. బీరువాలో దాచి ఉంచిన 12 గ్రాముల బంగారం, 12 తులాల వెండి, రెండు తులాల వెండి, రూ.20 వేలు నగదు అపహరణకు గురైనట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.